


# కరపత్రం

SINCE 2014

గురువారం ఆగస్ట్ 20, 2026 | సంపుటి : 2 | సంచిక : 309 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



# ఇందిరమ్మ ఇళ్లు..

## క్యూర్ పరిధిలో ఈనెల 27 నుంచి లాటరీ

- ఆగస్టు 27 నుంచి 30 వరకు లాటరీ ప్రక్రియ
- లాటరీలో ఎంపికైన వారికి ఎల్ఐజీ ఫ్లాట్ల కేటాయింపు
- రోజుకు 4 నియోజకవర్గాల చొప్పున లాటరీ
- గురువారం వెబ్సైట్లలో అర్హుల జాబితా విడుదల
- ఈనెల 23 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఆగస్టు 25న అర్హుల తుది జాబితా ప్రకటన

**హైదరాబాద్:** రాజధానిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి ఈనెల 27 నుంచి 30 వరకు లాటరీ తీయనున్నారు. లాటరీలో పేర్లు వచ్చిన వారికి ఎల్ఐజీ ఫ్లాట్లు కేటాయించనున్నారు. రోజుకు 4 నియోజకవర్గాల చొప్పున లాటరీ తీయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. గురువారం సాయంత్రం హౌసింగ్ బోర్డు, మీసేవ వెబ్సైట్లలో అర్హుల జాబితా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ జాబితాపై ఈనెల 23 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, 25న అర్హుల తుది జాబితా ప్రకటిస్తామని గౌతమ్ పేర్కొన్నారు.



# ఫిలిప్పీన్స్ లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ

- గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానంపై చర్చ
- ఫిలిప్పీన్స్ వలస విధానాన్ని పరిశీలించిన కమిటీ సభ్యులు
- ఇండియన్ ఎంబసీ అంబాసడర్ హర్షకుమార్ జైన్తో భేటీ
- ఫిలిప్పీన్స్ ఉన్నతాధికారులతోనూ కమిటీ చర్చలు
- గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఫిలిప్పీన్స్ తరహా విధానాలపై అధ్యయనం
- 15 లక్షల మంది తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమమే లక్ష్యం
- సీఎం రేవంత్రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కమిటీ పర్యటన

2లో

**మనీలా:** తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. ఆ తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు.



## 'సర్'.. ఏఎస్‌డీ ఓట్ల జాబితాలో మీ పేరుందా? చెక్ చేసుకోండిలా!

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ముసాయిదా జాబితాను ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఆగస్టు 10 నాటికి మొత్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా..

2లో




## తెలంగాణలో మరో 10 పట్టణాల్లోకి ఉబర్

రైడ్ షేరింగ్ సంస్థ ఉబర్ తాజాగా దేశవ్యాప్తంగా మరో 100 నగరాల్లో తమ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో తెలంగాణలోని 10 నగరాల్లో సర్వీసులు విస్తరించినట్లు సంస్థ తెలిపింది.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ విస్తరణలో భాగంగా కొత్త ప్రయాణికులకు పరిమిత కాలం పాటు మొదటి రైడ్ను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించింది. దేశీయంగా 225 నగరాల మార్కును దాటడం ద్వారా మరింత మంది ప్రయాణికులకు సర్వీసులను విస్తరించినట్లయిందని ఉబర్ ఇండియా డైరెక్టర్ రిషాంత్ ఘోష్ చెప్పారు.

## రేగా కాంతారావుకు హైకోర్టులో ఊరట

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు కొట్టివేత
- ఎఫ్ఐఆర్ రద్దు చేసిన తెలంగాణ హైకోర్టు
- లైంగిక వేధింపులు, మోసం ఆరోపణలపై కేసు
- పంజాగుట్ట పోలీసులకు యువతి ఫిర్యాదు
- ఆరోపణల కేసులో గతంలో రేగా కాంతారావు అరెస్ట్
- ఎఫ్ఐఆర్ కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన రేగా

**హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. కాగా లైంగిక ఆరోపణల కేసులో పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావు అరెస్టయ్యారు.పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లుగా లైంగిక




2లో..

వేధింపులకు పాల్పడ్డారని పంజాగుట్ట పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది.



2లో..

## సుస్మిత వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- సుస్మిత వ్యవహారం పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని వెల్లడి
- వ్యక్తిగతంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయనని స్పష్టం
- 'పచ్చ కాంగ్రెస్.. తెల్ల కాంగ్రెస్' అంటూ వర్గాలేవీ లేవని వ్యాఖ్య
- తనకు, మంత్రి కొండా సురేఖకు మధ్య విభేదాలు లేవని స్పష్టీకరణ
- పరకాలలో కొందరు కావాలనే డిస్టర్బ్ చేస్తున్నారని ఆరోపణ



## మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు

మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

**చిన్నారెడ్డికి కూడా...**

కాగా, మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. వనపర్తి సభలో పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలపై చిన్నారెడ్డిని కమిటీ వివరణ కోరింది.

## 22ఏ భూ బాధితులకు అండగా బీఆర్ఎస్

- 22ఏ బాధితులకు అండగా ఉంటామని హరీశ్‌రావు హామీ
- నిషేధిత జాబితా నుంచి భూములు వెంటనే తొలగించాలని డిమాండ్
- బాధితులకు బీఆర్ఎస్ లీగల్ సెల్ అందుబాటులో ఉంటుందని వెల్లడి
- ప్రభుత్వం వినకపోతే పోరాటానికి సిద్ధమని హరీశ్‌రావు ప్రకటన
- భూముల తొలగింపులో 30--50% కమీషన్ ఆరోపణలు వస్తున్నాయని వ్యాఖ్య
- భువనగిరిలో 40 వేల ఎకరాలు 22ఏ జాబితాలో ఉన్నాయని ప్రస్తావన
- భూ భారతీ సైట్ పనిచేయడం లేదని ప్రభుత్వంపై విమర్శ
- అవసరమైతే సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరిక

**తెలంగాణ భవన్:** 22ఏ భూ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూ బాధితులతో సమావేశం నిర్వహించారు.



2లో..

## గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు



మిగతాది 2లో

**హైదరాబాద్:** నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## భారీ సైబర్ క్రైమ్.. బాధితుడికి రూ.కోటి రిఫండ్ చేసిన సైబరాబాద్ సీపీ

**హైదరాబాద్:** సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం సీపీ రమేష్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. "సైబర్ నేరగాళ్లు.. చీరల దుకాణం అకౌంటెంట్‌కు వాట్సప్‌లో యజమాని పేరు, డీపీతో నకిలీ మెసేజ్ పంపి రూ.కోటి కాజేశారు. ఈకేసులో యూపీలోని లక్నోకు చెందిన దీపక్ కుమార్‌ను అరెస్ట్ చేశాం.



2లో..

## ప్రిన్సిపాల్ రూపారెడ్డిని చంపింది పదోతరగతి విద్యార్థులే: ఎస్పీ

**నల్గొండ:** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసును నల్గొండ పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ దారుణ ఘోరానికి ఒడిగట్టింది మరెవరో కాదు.. అదే పాఠశాలలో చదువుతున్న ఇద్దరు మైనర్ విద్యార్థులని పోలీసులు నిర్ధారించారు. 27సార్లు కత్తితో పొడిచేసి ప్రాణం తీసిన నిందితుల్ని కేవలం ఒకే ఒక్క క్లూ ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు.



2లో..

# సుస్మిత వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**వరంగల్:**
మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తాజాగా స్పందించారు. సుస్మిత వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. అవసరమైతే పార్టీ అధిష్ఠానం తగిన దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. వ్యక్తిగతంగా తాను దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదని, పార్టీ నిర్ణయమే అందరికీ శిరోధార్యమని పేర్కొన్నారు.
వరంగల్‌లో నిర్వహించిన చిట్‌చాట్‌లో రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరకాల నియోజకవర్గంలో కొందరు కావాలనే డిస్టర్బ్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అందుకే ప్రజలకు స్పష్టత ఇచ్చే ప్రయత్నం జరిగిందని చెప్పారు. అనేక సర్వేల ఫలితాల ఆధారంగానే పరకాల సభలో ముఖ్యమంత్రి తన పేరును ప్రకటించారని తెలిపారు.

**పచ్చ కాంగ్రెస్.. తెల్ల కాంగ్రెస్ అంటూ ఏమీ లేదు..**
కాంగ్రెస్ పార్టీలో 'పచ్చ కాంగ్రెస్.. తెల్ల కాంగ్రెస్' అంటూ వర్గాలు ఏమీ లేవని రేవూరి స్పష్టం చేశారు. తాను అయినా, మంత్రి అయినా పార్టీ లైన్‌కు కట్టుబడి పనిచేయాల్సిందేనని అన్నారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. పార్టీలో ఏదైనా అంశంపై భిన్నాభిప్రాయాలు ఉంటే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాగే, పరకాలలో జరిగిన సభకు మంత్రి కొండా సురేఖను తాను ఆహ్వానించానని రేవూరి తెలిపారు. అయితే ఆమె సభకు ఎందుకు హాజరుకాలేదో తనకు తెలియదని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి ఏ ప్రోటోకాల్ ఉంటుందన్న అంశంపైనా స్పందిస్తూ.. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన విషయంలో ప్రోటోకాల్ ఉల్లంఘనగా పేర్కొనడం సరికాదన్నారు.

**సీఎం ప్రకటనతో మరింత బాధ్యత**
తాను సమర్థవంతంగా పనిచేస్తున్నందుకే తనకు అనుకూలంగా సర్వే ఫలితాలు వచ్చాయని రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పరకాల సభలో తన పేరును ప్రకటించడం తనపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత సమర్థవంతంగా పనిచేస్తానని తెలిపారు.

**సుస్మిత వ్యాఖ్యల కలకలం..**
ఇదిలా ఉండగా.. అంతకుముందు కొండా సుస్మితా చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో "అప్‌కమింగ్ పరకాల ఎమ్మెల్యే" అంటూ సుస్మిత పోస్టు చేయడంతో.. పరకాల రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఆసక్తి పెరిగింది. అయితే, కొండా కుటుంబానికి పరకాల నియోజకవర్గంతో రాజకీయంగా బలమైన అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో సుస్మితను పరకాల నుంచి రాజకీయ రంగంలోకి తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం కొంతకాలంగా ఉంది. తాజాగా ఆమె చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఆ చర్చకు మరింత బలం చేకూర్చింది. అయితే, మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా పరకాల నియోజకవర్గ పరిధిలో భారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గీసుకొండ మండలంలోనూ పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సుస్మిత పటేల్ రాజకీయంగా కీలక ప్రకటన చేస్తారా? అన్న ఆసక్తి కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డిని చంపింది పదోతరగతి విద్యార్థులే: ఎస్పీ

ఈ కేసుకు సంబంధించి మీడియాకు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**'బాబు' అనే పిలుపే హంతకులను పట్టించింది!**
హత్య జరగడానికి కొద్దిసేపటి ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో హంతకులు ఇంట్లోకి ప్రవేశించగా, రూపారెడ్డి ఫోన్ కట్ చేయకుండానే 'బాబు' అని పిలిచారు. ఆ తర్వాత ఫోన్ కట్ అయిపోయింది. రూపారెడ్డి చిన్నమ్మ ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సాధారణంగా పాఠశాల విద్యార్థులను 'బాబు'అని పిలవడం రూపారెడ్డికి అలవాటు. దీంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించగా, అసలు నిందితులు సొంత స్కూల్ విద్యార్థులేనని తేలింది.

**హత్యకు దారితీసిన కారణాలు**
నిందితులిద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. వీరి వయస్సు కేవలం 16 సంవత్సరాలు. జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడిన వీరు.. హాస్టల్‌లో నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ ఫోన్లు వాడుతూ ప్రిన్సిపాల్ రూపారెడ్డికి దొరికిపోయారు. అంతేకాకుండా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో 'తేలికగా డబ్బు సంపాదించడం ఎలా?' అని వెతుకుతుండగా గమనించిన ప్రిన్సిపాల్.. వారి తల్లిదండ్రులను పిలిపించి సమక్షంలోనే గట్టిగా మందలించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ఆ విద్యార్థులు ప్రిన్సిపాల్‌పై తీవ్ర కక్ష పెంచుకున్నారు.

**యూట్యూబ్‌లో హత్యకు స్కెచ్.. పక్కాగా రెక్కి**
ప్రిన్సిపాల్ రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని భావించిన నిందితులు, ఆమెను అంతమొందించి ఆ డబ్బు దోచుకోవాలని ప్లాన్ చేశారు. హత్య చేసి పోలీసులకు దొరకకుండా ఎలా తప్పించుకోవాలి? అనే విషయాలపై సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో వారం రోజుల పాటు అన్వేషించారు. సాంకేతికంగా దొరకకుండా ఉండేందుకు పక్కాగా రెక్కి నిర్వహించారు. ప్రణాళికలో భాగంగా కొండమల్లేపల్లిలోనే ఒక కత్తి, చేతి గ్లౌజులు కొనుగోలు చేశారు.

**రక్తపు మరకల నోట్లతో దొరికిపోయారు**
హత్య జరిగిన రోజు రూపారెడ్డి ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి ఇద్దరు నిందితులు ఆమె ఇంటికి చేరుకున్నారు. ఒక విద్యార్థి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద నిలబడి ఎవరైనా వస్తున్నారా అని నిఘా పెట్టగా .. మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. అనంతరం రూపారెడ్డిపై కత్తితో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. హత్య అనంతరం ఇంట్లో ఉన్న రూ. 1.54 లక్షల నగదుతో పాటు, ఆధారాలు దొరకకుండా రూపారెడ్డి వ్యక్తిగత ఫోన్‌ను తీసుకుని నిందితులు పారిపోయారు. విచారణలో భాగంగా ఇద్దరు మైనర్ నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారి వద్ద నుంచి హత్య సమయంలో రక్తపు మరకలు అంటుకున్న రూ. 1.54 లక్షల నగదును, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.
రూపా రెడ్డి హత్య కేసు.. అనుమానం ఎలా వచ్చిందంటే..!
ఙూ సంచలనం
కాగా, హత్య జరిగిన తర్వాత ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు 50 మందికి పైగా అనుమానితులను విచారించారు. చివరకు, రూపారెడ్డి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా, ఎరుపు రంగు షర్ట్ ధరించిన ఒక మైనర్ బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. ఆ క్లూ ఆధారంగా పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తన స్నేహితుడితో కలిసి చేసిన ఈ ఘోర హత్యోదంతాన్ని పూర్తి వివరాలతో ఒప్పుకున్నాడు.

ప్రస్తుతం నిందితులైన ఇద్దరు మైనర్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి చట్టపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నారు. గురువు స్థానంలో ఉన్న ప్రిన్సిపాల్‌ను విద్యార్థులే ఇంత ఘోరంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# 'సర్'.. ఏఎస్‌డీడీ ఓట్ల జాబితాలో మీ పేరుందా? చెక్ చేసుకోండిలా!

మొదటిపేజీ తరువాయి
దాదాపు 73.30 లక్షల (21.70%) మందిని ఏఎస్‌డీడీ (ఆచూకీ లేనివారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, మృతి చెందిన వారు, డూప్లికేట్) విభాగాల కింద ఈసీ అధికారులు 'అన్‌కలెక్టబుల్' జాబితాలో చేర్చారు. తాజాగా 'సర్' ముసాయిదా జాబితాలో చేర్చని ఓటర్ల జాబితాలను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో ముసాయిదా జాబితాలో మీ పేరు లేకపోతే.. ఏఎస్‌డీడీ/అన్‌కలెక్టబుల్ జాబితాలో ఉందేమో చెక్ చేసుకోవడం ఎలాగో చూద్దాం..
తొలుత https://ceotelangana.nic.in/ వెబ్‌సైట్‌ను సందర్శించండి.
హోమ్ పేజీలో Absent/Shifted/Dead and Duplicate (ASDD) Electors Listపై క్లిక్ చేయండి.
ఆ తర్వాత వచ్చే ప్రత్యేక విండోలో మీ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, పార్ట్ నంబర్/పేరును సెలక్ట్ చేసి క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి సబ్‌మిట్ కొట్టండి.
వెంటనే ఓ పీడీఎఫ్ ఫైల్ డౌన్‌లోడ్ అవుతుంది. తెలుగులో ఓపెన్ అయ్యే ఈ జాబితాలో మీ పేరును చెక్ చేసుకోవచ్చు.
ఏఎస్‌డీడీ జాబితాలో ఓటరు పేరు, బంధువు పేరు, వయసు, ఎన్యూమరేషన్ ఫారమ్‌ను సేకరించకపోవడానికి గల కారణమేంటి అనే వివరాలను పొందుపరిచారు. ఈసీ తెలిపిన కారణాల్లో 'శాశ్వతంగా నివాసం మారడం, మరణించడం, ఇప్పటికే నమోదు కావడం, అందుబాటులో లేకపోవడం/అదృశ్యం' వంటి అంశాలను పేర్కొన్నారు.
మరోవైపు, తెలంగాణలో ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఏఎస్‌డీడీ జాబితాలను సంబంధిత ఈఆర్వో/ఏఈఆర్వో కార్యాలయాలు, గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు ఈసీ తెలిపింది. దీని ద్వారా తమ పేర్లను ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో చేర్చకపోవడానికి గల కారణాలను ప్రజలు తెలుసుకొనే అవకాశం కలుగుతుందని పేర్కొంది. క్లెయిమ్‌లను ఫైల్ చేసేందుకు, అభ్యంతరాలను తెలిపేందుకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఈసీ తెలిపింది. అక్టోబర్ 19న తుది జాబితాను ప్రకటించనుంది.

# రూ.20 లంచం కేసు.. 30ఏళ్లకు నిర్దోషులుగా తేలి..!



రూ.20 లంచం ఆరోపణలకు సంబంధించిన కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో వారిని దోషులుగా తేల్చుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం పక్కనపెట్టింది. లంచం డిమాండ్ చేసినట్లు ఎటువంటి ఆధారాలు లేవని, కేవలం రూ.20 రికవరీ చేసినంత మాత్రాన దోషిగా నిర్ధరించలేమని పేర్కొంది.
గుజరాత్ ఆనంద్ జిల్లాలోని బెహ్రీ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి 1996 ఫిబ్రవరిలో ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అక్కడ పనిచేసే క్లర్క్ (ఓ గ్రామస్థాయి రెవెన్యూ అధికారి) రూ.120 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో రూ.100 తనకు కాగా.. మరో రూ.20లు ప్యూన్ కోసమని చెప్పాడు. దీంతో ఆ విద్యార్థి ఏసీబీని ఆశ్రయించాడు. ట్రాప్ చేసిన అధికారులు.. డబ్బులు తీసుకొని సర్టిఫికెట్ ఇస్తుండగా ప్యూన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద రూ.20 స్వాధీనం చేసుకున్నారు. మరో రూ.100 మాత్రం లభించలేదు.
ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు.. ఇద్దరు ఉద్యోగులను దోషులుగా తేల్చుతూ 1999లో తీర్పు వెలువరించింది. అనంతరం గుజరాత్ హైకోర్టు కూడా దీనిని సమర్థించింది. అనంతరం ఈ కేసు సుప్రీం కోర్టుకు చేరింది. అయితే, తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేవని క్లర్క్, లంచం ఇవ్వాలని విద్యార్థిని ఎప్పుడూ అడగలేదని ప్యూన్ వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. బాధితుడి ప్రకటనలో వైరుధ్యాలున్నట్లు గుర్తించింది. అంతేకాకుండా.. మరుసటి రోజు ఈద్ ఉన్నందున విద్యార్థి తనకు రూ.20 ఇచ్చాడని ప్యూన్ చెప్పడం సమర్థనీయంగానే కనిపించిందని అభిప్రాయపడింది.



# సంజీవయ్య పార్కులో 'లేజర్ షో' జిగేల్.. టికెట్ ధర ఎంతంటే?

హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కులో ప్రత్యేక లేజర్ షో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. పర్యాటకుల కోసం ఇక్కడ మల్టీమీడియా లేజర్ షో, వాటర్ స్క్రీన్, మ్యూజికల్ ఫౌంటెయిన్‌ను తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రారంభించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ సహకారంతో రూ.49.65 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. హైదరాబాద్‌ను ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా ప్రోత్సహించడంలో భాగంగా సందర్శకులకు ప్రపంచస్థాయి వినోద అనుభూతిని అందించడమే లక్ష్యంగా దీన్ని చేపట్టారు.

**షో టైమింగ్స్:**

**ఫస్ట్ షో: సాయంత్రం 7గంటల నుంచి 7.30గంటల వరకు**
**సెకండ్ షో: రాత్రి 8గంటల నుంచి 8.30 గంటల వరకు**
టికెట్ ధర ఎంత?: పెద్దవాళ్లకైతే ఒక్కొక్కరికి రూ.150, పిల్లలకైతే (5-12 ఏళ్లు) రూ.120 చొప్పున చెల్లించాలి.
ఈ మల్టీమీడియా షోలో అద్భుతమైన లేజర్ ప్రొజెక్షన్‌లు, వాటర్ స్క్రీన్‌పై ప్రదర్శించే ఆకర్షణీయమైన దృశ్యాలు, సంగీతానికి అనుగుణంగా కనులవిందు చేసే మ్యూజికల్ ఫౌంటెయిన్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం వేళ పిల్లలతో పాటు కుటుంబ సమేతంగా విచ్చేసే పర్యాటకులకు వేళ ఆహ్లాదకరమైన, వినోదదాయకమైన అనుభూతిని పంచేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. మరిన్ని వివరాల కోసం 9848126947, 9848125720, 9848306435, 8340811234 నంబర్లలో సంప్రదించవచ్చు.

# రేగా కాంతారావుకు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి
తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేశారనిరియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో తన వద్ద నుండి డబ్బులు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రేగా కాంతారావుపై పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేశారు. అయితే తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయన కేసును విచారించిన ధర్మాసనం ఈ కేసును కొట్టివేసింది.

# 22ఏ భూ బాధితులకు అండగా బీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కుట్రతో భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చుతుంది.కష్టాల్లో ఉన్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది 22ఏ భూ బాదితులకు బిఆర్ఎస్ లీగల్ సెల్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందుబాటులో ఉంటారు. మంచి మాటతో ప్రభుత్వం వినక పోతే ఎలాంటి పోరాటానికి అయినా సిద్ధం.30 ఏళ్ల క్రింద రిజిస్ట్రేషన్ అయితే ఇప్పుడు ఎందుకు ఇబ్బంది అవుతుంది. నిషేధిత జాబితా నుండి తీసివేయాలంటే 30 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నారు అని చెబుతున్నారు.
మంత్రి నిషేధిత జాబితా నుండి తీసేశారట..ముఖ్యమంత్రి నిషేధిత జాబితాలో పెట్టించారట. ముఖ్యమంత్రి,పొంగులేటికి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే..బీఆర్ఎస్ నాయకులకు పోరాటాలు తెలుసు.ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదు. భువనగిరిలో 40వేల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. సీఎంకు నాలుగు సార్లు చెప్పారని అన్నారు.
ముఖ్యమంత్రి , పొంగులేటిని భర్తరఫ్ చెయ్యి...అన్ని సజావుగా జరుగుతాయి.ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఎందుకు లంచాలు ఇవ్వాలి. నిషేధిత జాబితాలో పెట్టిన వాటిని వెంటనే తొలగించాలి.ముఖ్యమంత్రికి తెలియకుండా జరిగితే పొంగులేటిని వెంటనే భర్తరఫ్ చేయాలి. 22ఏ నిషేధిత భూముల విషయంలో ఏ1 రేవంత్ రెడ్డి,ఏ2 పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.
కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎకరాల్లో కొని గజాల్లో అమ్ముతున్నారని ముఖ్యమంత్రి అంటున్నారు. హిల్ట్ పాలసీతో ఉద్యోగాలు పోగొట్టారు.ప్రజలకు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. ప్రభుత్వం చేసిన కుట్ర.. వెంటనే సుమోటోగా స్వీకరించి తొలగించాలి.భూ భారతీ సైట్ పని చేయడం లేదు. అవసరం అయితే ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిద్దాం'అని పిలుపునిచ్చారు.

# గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి
"ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు.
బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలి" అని డీసీపీ సూచించారు.

# భారీ సైబర్ క్రైమ్.. బాధితుడికి రూ.కోటి రిఫండ్ చేసిన సైబరాబాద్ సీపీ

మొదటిపేజీ తరువాయి
కోర్టు సత్వర ఆదేశాలు, పోలీసుల చొరవతో కేవలం పది రోజుల్లోనే రూ.కోటి మొత్తాన్ని బాధితుడికి అందజేశాం. భారీ మొత్తంలో డబ్బు పంపమని ఎవరైనా అడిగినప్పుడు.. కేవలం వాట్సప్ డీపీలు, పేర్లు చూసి నగదు ట్రాన్స్‌ఫర్ చేయొద్దు. డబ్బులు పంపే ముందు వేర్వేరు మార్గాల ద్వారా వారి వివరాలు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి. వాట్సప్ లేదా ఇతర యాప్స్ ద్వారా వచ్చే గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయవద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలి" అని సీపీ సూచించారు.

# ఫిలిప్పీన్స్ లో ఇండియన్ ఎంబసీని సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ

మొదటిపేజీ తరువాయి
ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుధీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది.
ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

# మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు

మొదటిపేజీ తరువాయి
స్థానిక ఎమ్మెల్యేపై అనుచిత ప్రసంగం చేసిన అంశంపైనా మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని టీపీసీసీ కోరింది.

**జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు**
జక్కిడి ప్రభాకర్ రెడ్డిపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు వేసింది. ఎల్‌బీ నగర్ కాంగ్రెస్ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్ రెడ్డి సస్పెండ్ చేస్తూ కమిటీ ఆదేశాలు ఇచ్చింది. వ్యక్తిగత, కులపరమైన దూషణలపై ఆధారాలు ఉండటంతో చర్యలు తీసుకున్న కమిటీ.. జక్కిడి ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# ఆస్తి ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలి

# లిమిటేషన్ ఆక్ట్ కు లిమిటేషన్ ఉంది

**బోయిని సత్యనారాయణ, అడ్వకేట్**

**లిమిటేషన్ ఆక్ట్ (కాలపరిమితి చట్టం) పై ఇటీవల తెలంగాణ హైకోర్టు కొన్ని కీలకమైన మరియు చారిత్రాత్మకమైన తీర్పులను వెలువరించింది.**

**అందులో ముఖ్యమైన రెండు ఇటీవల తీర్పుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:**

12 ఏళ్ల తర్వాత దాఖలు చేసే ఆస్తి క్లెయిమ్ దావాలు చెల్లవు అంటూ
**తెలంగాణ హైకోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం "నో ప్రాపర్టీ క్లెయిమ్ ఆఫ్టర్ 12 ఇయర్స్ ఆఫ్ సైలెన్స్" వివాదంలో కాలపరిమితి చట్టంపై ఒక కీలకమైన తీర్పునిచ్చింది.**

**కేసు నేపథ్యం:**

- **22nd సెంచరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనే ఒక రియల్ ఎస్టేట్ సంస్థ దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్ నెం. 234 / 2024 ను విచారించిన కోర్టు**

రెస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ మరియు నలుగురు ఇతరుల వాదనలు విన్న తరువాత...
**1967లో జరిగిన భూ బదిలీలను సవాలు చేస్తూ 2020లో దాఖలైన సివిల్ సూట్‌ను కొట్టివేసింది.**

గౌరవనీయులైన జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి గారి కోర్ట్ తీర్పుతో లిమిటేషన్ ఆక్ట్ లో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం తలెత్తింది.

**కోర్టు తీర్పు**

లిమిటేషన్ చట్టం ప్రకారం నిర్దేశిత 12 సంవత్సరాల కాలపరిమితి దాటిపోయిన తర్వాత, పూర్వీకుల ఆస్తిపై ఎలాంటి హక్కులను క్లెయిమ్ చేయలేరని కోర్టు స్పష్టం చేసింది.

**చట్టవిరుద్ధమైన వ్యాజ్యాలు**

కేవలం కోర్టును బురిడీ కొట్టించడానికి తెలివిగా డ్రాఫ్టింగ్ (Clever Drafting) చేసి, కొత్తగా సమస్య వచ్చినట్లు భ్రమ కల్పించి దశాబ్దాల నాటి కేసులను తిరిగి తవ్వడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని హైకోర్టు హెచ్చరించింది.

- **చిన్న తరహా పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈ (MSME) ఆలస్యపు చెల్లింపుల వివాదాలకు లిమిటేషన్ యాక్ట్ వర్తిస్తుంది అని మే 2025 న జస్టిస్ పి. సామ్ కోశీ మరియు జస్టిస్ ఎన్. తుకారాంజీలతో కూడిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం "లిమిటేషన్ యాక్ట్ అప్లైస్ టు ప్రొసీడింగ్స్" అండర్ ఇంట్రెస్ట్ ఆన్ డిలేడ్ పేమెంట్స్ యాక్ట్ లో ఒక కీలక స్పష్టత ఇచ్చింది.**

- **చిన్న తరహా పరిశ్రమలకు చెల్లించాల్సిన బకాయిలపై వడ్డీ చెల్లింపుల వివాదంలో (Interest on Delayed Payments Act, 1993) ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సివిల్ కోర్టు సమర్థించింది. అయితే లిమిటేషన్ యాక్ట్ దీనికి వర్తించదని ట్రిబ్యునల్ భావించింది.**

**ప్రత్యేక చట్టాలలో కాలపరిమితిని ప్రత్యేకంగా మినహాయించనంత వరకు, లిమిటేషన్ యాక్ట్, 1963 లోని నిబంధనలు అన్ని రకాల ఆర్బిట్రేషన్ మరియు రికవరీ చర్యలకు వర్తిస్తాయి అని హైకోర్టు స్పష్టం చేసింది. చట్టంలో ప్రత్యేక మినహాయింపు లేనప్పుడు, బకాయిల వసూలు కోసం ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిర్ణీత కాలపరిమితి లోపే దావాలు వేయాలని కోర్టు నిర్దేశించింది.**

మనదేశంలో ఇప్పటివరకు లిమిటేషన్ కాల పరిమితి లేకుండా కేసులు ఫైల్ చేసేవారు. ఉన్నత కోర్టుల కొత్త రూలింగ్ లతో ఇకపై ఈ వెసులుబాటు లభించదని అర్థం అవుతున్నది.

భారతదేశంలో కాలపరిమితి చట్టం (Limitation Act, 1963) ప్రకారం ఆస్తి తగాదాలకు మరియు వ్యాపార/ఆర్బిట్రేషన్ బకాయిలకు వర్తించే పూర్తి చట్టపరమైన నిబంధనలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.




**మిటేషన్ యాక్ట్ ఆర్టికల్ 65 ప్రకారం యాజమాన్య హక్కుల ఆధారంగా ఒక వ్యక్తి తనకున్న రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేదా యాజమాన్య హక్కుల (Title) ఆధారంగా తన ఆస్తిని తిరిగి పొందడానికి (Recovery of Possession) 12 సంవత్సరాల లోపు కోర్టులో దావా వేయాలి.**

ఆర్టికల్ 64 (మునుపటి ఆధీనం ఆధారంగా - Based on Previous Possession) చట్టవిరుద్ధంగా ఆస్తి నుండి తొలగించబడినప్పుడు (Dispossession), మునుపటి స్వాధీన హక్కుల ఆధారంగా దావా వేయడానికి కూడా 12 ఏళ్ల గడువు ఉంటుంది.

**ప్రతికూల స్వాధీనం (Adverse Possession) ante ఒక వ్యక్తి వేరొకరి స్థిరాస్తిని ఎటువంటి అంతరాయం లేకుండా, యజమానికి తెలిసేలా బహిరంగంగా, నిరంతరాయంగా 12 సంవత్సరాల పాటు తన ఆధీనంలో ఉంచుకుంటే, అతను ఆ ఆస్తిపై చట్టపరమైన హక్కులను పొందుతాడు.**

- **దీనినే 'అడ్వర్స్ పొసెషన్' అంటారు. ఈ 12 ఏళ్ల కాలంలో అసలు యజమాని ఎటువంటి సివిల్ దావా వేయకపోతే, అతని యాజమాన్య హక్కులు శాశ్వతంగా రద్దవుతాయి.**

ప్రభుత్వ ఆస్తుల మినహాయింపు... వివాదంలో ఉన్న ఆస్తి కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదైతే, ఈ కాలపరిమితి 12 ఏళ్లు కాదు, 30 సంవత్సరాలు ఉంటుంది.

**వ్యాపార బకాయిలు**
**ఆర్బిట్రేషన్ కాలపరిమితి 3 ఏళ్ల నిబంధన**
వ్యాపార లావాదేవీలు, ఒప్పందాల ఉల్లంఘన మరియు ఆర్బిట్రేషన్ బకాయిల వసూలుకు కాలపరిమితి చట్టం చాలా తక్కువ సమయాన్ని ఇస్తుంది. ఇక్కడ 3 సంవత్సరాల గడువు అత్యంత కీలకం.
వ్యాపార / కాంట్రాక్ట్ బకాయిలు (Commercial Dues)
ఏదైనా వ్యాపార ఒప్పందం ఉల్లంఘనకు గురైనా, లేదా సరుకులు/సేవలు అందించిన తర్వాత రావలసిన బకాయిలు నిలిచిపోయినా, సదరు ఉల్లంఘన జరిగిన రోజు నుండి (Cause of Action) 3 సంవత్సరాల లోపు మాత్రమే సివిల్ కోర్టులో రికవరీ దావా వేయాలి.
**సెక్షన్ 18 (లిఖితపూర్వక గుర్తింపు - Acknowledgment of Debt): ఒకవేళ ఆ 3 ఏళ్ల గడువు ముగియక ముందే, అవతలి పక్షం వారు బాకీ ఉన్నట్లు ఈమెయిల్, వాట్సాప్ లేదా సంతకం చేసిన లేఖ ద్వారా లిఖితపూర్వకంగా అంగీకరిస్తే (లేదా కొంత భాగం చెల్లిస్తే), ఆ రోజు నుండి మరో 3 ఏళ్ల కొత్త గడువు ప్రారంభమవుతుంది.**

**ఆర్బిట్రేషన్ నిబంధనలు** (Arbitration Claims)

**ఆర్బిట్రేటర్ నియామకానికి** (Section 11): **వ్యాపార వివాదాల్లో ఆర్బిట్రేషన్ ప్రక్రియను ప్రారంభించడానికి అవతలి పార్టీకి నోటీసు పంపినప్పుడు, వారు 30 రోజుల్లోగా స్పందించకపోతే.. ఆర్బిట్రేటర్‌ను నియమించాల్సిందిగా కోర్టును ఆశ్రయించడానికి** Limitation Act **లోని ఆర్టికల్ 137 ప్రకారం 3 సంవత్సరాల గడువు ఉంటుంది.**

**ఆర్బిట్రల్ అవార్డు అమలు** (Execution of Award): **ఒకసారి ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తీర్పు** (Award) **ఇచ్చిన తర్వాత, దానిని సివిల్ కోర్టు డిక్రీ తరహాలోనే అమలు చేయవచ్చు. దీని అమలుకు మాత్రం ఆస్తి క్లెయిమ్ లాగే 12 సంవత్సరాల గడువు లభిస్తుంది.**

**తీర్పును సవాలు చేయడానికి** (Section **34**): **ఆర్బిట్రేషన్ తీర్పును కోర్టులో సవాలు చేయాలనుకుంటే కాలపరిమితి చాలా కఠినంగా ఉంటుంది. తీర్పు అందిన రోజు నుండి కేవలం 3 నెలల (గరిష్ఠంగా మరో 30 రోజుల పొడిగింపుతో) లోపు మాత్రమే పిటిషన్ వేయాలి.**
చట్టం పట్ల ఒక నిర్దిష్టమైన అభిప్రాయంతో ఎవరు కూడా మెలగకూడదు. మారుతున్న కాలంతో పాటు చట్టంలో కూడా మార్పులు జరుగుతూ ఉంటాయి.
ఈ మార్పులను గమనిస్తూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవలసిన అవసరం ఉంది.

**మిటేషన్ ఆక్ట్, ఆర్బిట్రేషన్ యాక్ట్ గురించి సమగ్ర సమాచారంతో లావాదేవీలు చేసినప్పుడు ఆర్థిక భద్రత లభించే అవకాశం ఉంది.**

## టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 19**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రం డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, నగర స్థాయిల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కేంద్రాల ద్వారా కొత్త పాన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, పాన్ కార్డు వివరాల్లో సవరణలు, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, బ్యాంకు నగదు బదిలీలు, ఆధార్ ఆధారిత చెల్లింపు సేవలు, మైక్రో ఏటీఎం సేవలు, నగదు డిపాజిట్లు, హెల్త్, బైక్, కార్ ఇన్సూరెన్స్ సేవలు, వివిధ బిల్లుల చెల్లింపులు వంటి ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందించవచ్చని పేర్కొన్నారు. అలాగే 100కు పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆమోదించిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు నమోదు, 100కు పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆమోదించిన స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్లకు నమోదు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన మాక్ టెస్టులకు నమోదు వంటి సేవలను కూడా అందించవచ్చని తెలిపారు. ప్రజలకు వివిధ ఆన్‌లైన్ సేవలను అందించడం ద్వారా కేంద్ర నిర్వాహకులు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వెంకట్ రెడ్డి వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఞఞఞ.ంవఞుశీఅశ్రీఱఅవ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వెంకట్ రెడ్డి
డైరెక్టర్, టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రం, హైదరాబాద్

## రాజీవ్ గాంధీ ఆశయాలే ఆధునిక భారతానికి మార్గదర్శకం: ఎనుకొంటి పున్నం చందర్

- **ఆధునిక భారత రూపశిల్పి, భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి – ఆగస్టు 20 సందర్భంగా ఘన నివాళులు**

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 19**

ఆధునిక భారత నిర్మాణానికి దూరదృష్టితో పునాదులు వేసిన భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి – ఆగస్టు 20 సందర్భంగా.. రాజీవ్ గాంధీకి హనుమకొండ 60వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎనుకొంటి పున్నం చందర్ ఘనంగా నివాళులర్పించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా 60 డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్ మాట్లాడుతూ.. దేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించిన దూరదృష్టి కలిగిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు. సమాచార సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టి, కంప్యూటరీకరణ, టెలికమ్యూనికేషన్ రంగాలకు కొత్త ఊపునిచ్చి భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. యువతకు అపారమైన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో విద్య, విజ్ఞానం, సాంకేతికత, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, మహిళల సాధికారత, ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆయన చూపిన అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాల సాధన ద్వారానే బలమైన, సమాన అవకాశాల భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుందని ఎనుకొంటి పున్నం చందర్ పేర్కొన్నారు.

# పాంచజన్యం లక్ష్యంగా.. సామాజిక న్యాయ దిశగా తెలంగాణ రక్షణ సేన






- **119 నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కీలక సమావేశం**
- **పార్టీ ప్రధాన ఎజెండా "పాంచజన్యం"ను ప్రతి ఇంటికి చేర్చాలని పిలుపు**
- **రాష్ట్రవ్యాప్తంగా "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలు" నిర్వహించాలని దిశానిర్దేశం**

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 19**

తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులతో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు సామాజిక న్యాయ తెలంగాణ సాధన దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన సిద్ధాంత పత్రం, ప్రజా ఎజెండాగా రూపొందించిన "పాంచజన్యం"ను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి తీసుకెళ్లాలని కవిత పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు పరిష్కార మార్గాలను ప్రతిపాదించే దిశగా రూపొందించిన 'పాంచజన్యం" ను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకెళ్లాలని, పార్టీ కార్యకర్తలు దానిని ప్రజలతో మమేకమయ్యే ఉద్యమ పత్రంగా మలచాలని సూచించారు.

- **సామాజిక న్యాయ తెలంగాణ**

సాధనే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కవిత, రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలు" నిర్వహించాలని పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. బడుగు, బలహీన వర్గాలు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ కొనసాగాలని కవిత స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని ప్రజల మధ్య మరింత బలోపేతం చేయడంతో పాటు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజా హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాలను చేపట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టిఆర్ఎస్ చీఫ్ కవిత పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ ముఖ్య నాయకులు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు పాల్గొని, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# ఆధునిక భారత నిర్మాణానికి దారిచూపిన దార్శనికుడు రాజీవ్ గాంధీ

- **యువత సాధికారత, గ్రామ స్వరాజ్యానికి పునాది వేసిన మహానేత, భారతరత్న రాజీవ్ గాంధీ**

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 19**

ఆధునిక భారత నిర్మాణంలో చిరస్మరణీయ పాత్ర పోషించిన దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి (ఆగస్టు 20) సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ అధినేత, జనగామ జిల్లా డీసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి భారతరత్న రాజీవ్ గాంధీకి ఘనంగా స్పందించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించాలనే స్పష్టమైన దార్శనికతతో రాజీవ్ గాంధీ ఎన్నో చారిత్రాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సమాచార సాంకేతిక రంగానికి ఆయన అందించిన ప్రోత్సాహమే నేడు ప్రపంచ ఐటీ రంగంలో భారత యువతకు అపార అవకాశాలను కల్పించిందని అన్నారు. కంప్యూటరీకరణ, టెలికమ్యూనికేషన్ విస్తరణ, శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి ఆయన చూపిన చొరవ దేశ ఆర్థిక ప్రగతికి బలమైన పునాదిగా నిలిచిందని వివరించారు. గ్రామీణ భారత అభివృద్ధికి




పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని డాక్టర్ రాజిరెడ్డి గుర్తు చేశారు. అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామ పంచాయతీలకు మరింత ప్రాధాన్యం కల్పించి, స్థానిక స్వపరిపాలన వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేసిన మహానాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. యువతే దేశ భవిష్యత్తని విశ్వసించిన రాజీవ్ గాంధీ, విద్య, విజ్ఞానం, సాంకేతికత, నవీన ఆలోచనలకు పెద్దపీట వేస్తూ యువశక్తిని జాతి నిర్మాణంలో భాగస్వామ్యం చేశారని కొనియాడారు. దేశ సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం, గ్రామీణ సంక్షేమం, శాస్త్రీయ దృక్పథం వంటి విలువలను ఆయన ఎల్లప్పుడూ ప్రోత్సహించారని తెలిపారు. ప్రస్తుత తరం యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పిలుపు నిచ్చారు. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై గర్వంగా నిలబెట్టేందుకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆధునిక భారత రూపశిల్పిగా ఆయన పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 20, 2026

# ఆధార్ పార్టీతోనే బడుగులకు న్యాయం: డా. ఈడ శేషగిరిరావు

- బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది
- 2028 ఎన్నికల్లో అధికారమే లక్ష్యం.. 119 నియోజకవర్గాల్లో పోటీకి కార్యాచరణ
- ప్రజా సమస్యలపై పోరాడే యువతకు పార్టీలో అవకాశాలు



**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 19**

బహుజనులు రాజకీయ కూలీలు కాదని, ఆధార్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది డా. ఈడ శేషగిరిరావు అన్నారు. బీసీల ఐక్యతే సమాజ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని నేచర్ 369 హోటల్‌లో నిర్వహించిన అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆధార్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధనతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బహుజనుల రాజకీయ, సామాజిక అభ్యున్నతికి ఐక్యతే ప్రధాన ఆయుధమని అన్నారు. బీసీలు తమ జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం సాధించేందుకు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేలా 'ఆధార్' పార్టీ కార్యాచరణ కొనసాగిస్తుందని తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభ్యున్నతికి సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సమగ్ర ప్రగతి సాధ్యమ వుతుందని అన్నారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 2028లో అధికారమే లక్ష్యంగా 'ఆధార్" పార్టీ ముందుకు సాగుతోందని, ప్రజా సమస్యలపై పోరాడే ఆసక్తి ఉన్న యువతకు పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో ఆధార్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గట్ల యుగేందర్ గౌడ్, ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ చైర్మన్ ఆంబోజు బుద్దయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బండా రాజారాం, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మధు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు నీరటి సత్యం, పార్లమెంట్ అధ్యక్షులు జెట్టి శ్రీనివాస్, పరకాల అసెంబ్లీ నాయకులు మల్లేష్, కొత్తగూడెం ఇన్‌చార్జి ప్రేమ్ దయిల్, ఖమ్మం ఇన్‌చార్జి బూర సైదరావు, ఖమ్మం పట్టణ అధ్యక్షులు నక్క అజయ్ పద్మశాలి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గంగుల రాజేందర్ ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మధు వర్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు తల్లాడ వెంకన్న, మంద హరినాథ్ బాబు, ఖమ్మం జిల్లా నాయకులు సునీల్, నాగరాజు, మొగిలయ్య, రవీంద్ర, శ్రీకాంత్, వరంగల్ జిల్లా నాయకులు అఖిల్, శ్రవణ్, సాగర్, రంజిత్, రాకేష్, శ్యామ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, మొగిలయ్య ఫౌండేషన్ కార్యదర్శి కూనూరు రంజిత్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు మార్క రవి గౌడ్, కంకేటి సాగర్, కూనూరు రాకేష్, కామగోని శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యపై జీవో 97ను వెంటనే ఉపసంహరించాలి

- విస్తృత చర్చ లేకుండా శక్తి విధానం అమలు సరికాదు.. సాంకేతిక కళాశాలల ఉనికికే ముప్పు: బీసీ ఇంటలెక్చువల్ ఫోరం

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, ఆగస్టు 19**



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి విధానం కింద జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ జీవో వల్ల పాలిటెక్నిక్ (డిప్లొమా) విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు, సాంకేతిక కళాశాలల మనుగడకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. జీవో నంబర్ 97కు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు ఇప్పటికే నిరసనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. సాంకేతిక విద్యా రంగంలో ఏవైనా సంస్కరణలు చేపట్టే ముందు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులు, సాంకేతిక విద్యా సంస్థల ప్రతినిధులతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించాలని సూచించింది.

పాలిటెక్నిక్ విద్య అనేది మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నైపుణ్యాధారిత సాంకేతిక విద్యను అందించే కీలక మార్గమని పేర్కొంది. అలాంటి విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే నిర్ణయాలను హడావుడిగా అమలు చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపింది. అందువల్ల ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 97ను రద్దు చేసి, సాంకేతిక విద్యా రంగానికి నష్టం కలగకుండా సమగ్ర విధానాన్ని రూపొందించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా రంగ నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సాంకేతిక విద్యలో సంస్కరణలు చేపట్టాలని కోరింది.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం



**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 19**

వరంగల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో సుమారు 200 మంది విద్యార్థులు,ఉద్యోగులు,ఇతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను పోలీసులు వివరించారు.డిజిటల్ అరెస్టు పేరుతో పోలీసు లేదా ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకుని కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు.తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి పథకాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.అనుమానాస్పద అనువర్తనాలను మొబైల్‌లో ఏర్పాటు చేయించి ఫోన్,బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించడం, బ్యాంకు ఖాతా వివరాలు లేదా కేవైసీ నవీకరణ పేరుతో వ్యక్తిగత సమాచారం, ఒకసారి ఉపయోగించే రహస్య సంఖ్యలను సేకరించడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.అపరిచితులకు వ్యక్తిగత,బ్యాంకింగ్ వివరాలు వెల్లడించవద్దని,అనుమానాస్పద కాల్స్, సందేశాలకు స్పందించే ముందు నిజానిజాలను నిర్ధారించుకోవాలని చెప్పారు.తెలియని అనుసంధానాలను తెరవకూడదని,ఒకసారి ఉపయోగించే రహస్య సంఖ్య,వ్యక్తిగత గుర్తింపు సంఖ్య,కార్డు రహస్య సంఖ్య,సంకేతపదాలను ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు.వెంటనే ఫిర్యాదు చేయాలి సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫోన్ చేయాలని సూచించారు.అలాగే సైబర్‌క్రైమ్.జీవోవి.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు లావాదేవీలను నిలిపివేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్విజ్ నిర్వహించారు.కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ అధికారి ఎం.వెంకటరమణ,సీఐ రవికుమార్,ఎస్‌ఐలు శ్రావణి,చరణ్,హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, కానిస్టేబుల్ జాహురుద్దీన్, ఎస్‌పీఏఆర్‌సీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- రాజకీయ అంశాలపై మాట్లాడే ముందు కనీస అవగాహన ఉండాలి..
- పార్టీ సభ్యత్వం లేని వ్యక్తి కాంగ్రెస్‌పై మాట్లాడటం విడ్డూరం
- సీనియర్ రాజకీయ నాయకులపై విమర్శలు చేయడం సరికాదు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 19**

కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా సుస్మిత పటేల్‌కు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, కనీసం పార్టీ కార్యకర్త కూడా కాదని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం కూడా లేని వ్యక్తి కాంగ్రెస్ పార్టీపై, పార్టీ నాయకులపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయ అంశాలపై మాట్లాడే ముందు ఆయా విషయాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వయసుకు మించి మాటలు మాట్లాడటం, జిల్లాలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన సీనియర్ నాయకులపై విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. రాజకీయాల్లో అనుభవం, వాస్తవాలపై అవగాహన లేకుండా చేసే వ్యాఖ్యలు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తాయని పేర్కొన్నారు. కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. వ్యక్తిగత విమర్శలకు కాకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై రాజకీయ నాయకులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మిపై ప్రభుత్వం వైఖరి అనుమానాస్పదం

- హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు?
- గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్



**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 19**

కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించి హైకోర్టు పరిధిలో విచారణ కొనసాగుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్ అన్నారు. హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడానికి కారణమేంటో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం అబిడ్స్ లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...

పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందో స్పష్టం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు.

ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా హామీలను సంపూర్ణంగా అమలు చేయలేకపోయిందని మండిపడ్డారు.

వ్యవసాయంపై ఆధారపడిన గిరిజనులు, సాధారణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా అమలైన రైతుబంధు పథకాన్ని రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, గతంలో అందుతున్న రూ.10 వేల రైతుబంధు సాయాన్ని కూడా సక్రమంగా అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు నిత్యం గుర్తు చేసుకుంటున్నారని మహేందర్ కుమార్ పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్య విద్యార్థులకు వరం: కొడకండ్ల సర్పంచ్ లక్ష్మి కొండయ్య

**గజ్వేల్ ఆగస్ట్ 19, కరపత్రం ప్రతినిది**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యలో మెలకువలు నేర్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కొడకండ్ల గ్రామ సర్పంచ్ లక్ష్మి కొండయ్య అన్నారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడడమే కాకుండా, మరొక నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని, ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.బుధవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని 'పీఎంశ్రీ' జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ లావణ్య సౌజన్యంతో విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సుకు సంబంధించిన నోట్‌బుక్స్‌ను సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు స్వయం ఉపాధిని అందిస్తాయని, ఎవరిపైనా ఆధారపడకుండా సమాజంలో స్వతంత్రంగా జీవించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. చిన్న వయసులోనే ఇటువంటి సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు అలవడడం వల్ల భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నారం జ్యోతి నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ పాల్ సింగ్ , ఒకేషనల్ ట్రైనర్ లావణ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 19**





దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ లోని కోమటిపల్లి గ్రామం మధుర నగర్ లో నూతన శ్రీ కూర్మచల అష్టలక్ష్మి సమేత నవనారసింహ వారాహి దేవస్థానం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయ వ్యవస్థాపకులు,అర్చకులు శ్రీమాన్ సేవాపతి రంగాచార్యులు గారు ఎమ్మెల్యేకి శాలువాలతో సత్కరించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవాటు చేసుకోవాలని. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు నిరంతరం సంపూర్ణ సహకార అందిస్తున్నామని అన్నారు.సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో ఇంత మంచి ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సునీల్, హసన్పర్తి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లావుద్య తిరుపతి,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,డివిజన్ నాయకులు కుమార్, లింగు, విజయ్, ఆలయ కమిటీ సభ్యులు రమణ, హరీష్,కిషోర్ విజయ్, తిరుపతి, కుమార్, రమేష్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు జాబితాపై సమీక్ష

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద






**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 19**

సమగ్ర ఓటరు జాబితా తయారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు.హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో సమగ్ర ఓటరు జాబితాపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమగ్ర ఓటరు జాబితా తయారీ,ఓటర్ల వివరాల పరిశీలన,సవరణలు,అభ్యంతరాల స్వీకరణ,పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.సమగ్ర ఓటరు జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామని కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు.ఓటర్ల వివరాల పరిశీలన నుంచి అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు




నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరుగుతున్నాయి. గత నాలుగు గంటలుగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు కొసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.